క్లుప్తంగా

14న ముగ్గుల పోటీలు

ఇచ్చోడ: మండల కేంద్రంలో సుభాష్‌నగర్ కాలనీలో ఈనెల 14న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కేజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొల్లూరి చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు రంగులు వెంట తెచ్చుకోవాలన్నారు. 89787 02318, 63022 19973 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

తాంసి: ఉపాధ్యాయ ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. బుధవారం తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు పాఠశాలలో టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదుతో పాటు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సీపీఎస్ విధానం రద్దుతో పాటు, పాఠశాలలో స్కావెంజర్‌ల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగారెడ్డి, శివారెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, స్వామి పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు

బోథ్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో బుధవారం కుటుంబనియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన 15 మంది మహిళలకు సూపరింటెండెంట్ రవీంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యులు చైతన్య, స్త్రీల వైద్య నిపుణులు శైలజల కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేశారు.

రేపు 2కే రన్

బోథ్: జనవరి 12న యువజనోత్సవాల సందర్భంగా మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు అనిల్ తెలిపారు. యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డు పరిధిలోని అగర్వాల్ జిన్నింగ్ మిల్లులో గురువారం నుంచి ఈనెల 15వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు జైనథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి కాంబ్లే మధుకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగతో పాటు పత్తి నిల్వలు, గింజల నిల్వలు పేరుకుపోయినందున కొనుగోళ్లు నిలిపివేయడం జరుగుతుందన్నారు. రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గొల్లఘాట్‌లో వైద్య శిబిరం

తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్‌లో బుధవారం తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సికిల్‌సెల్ అనీమియా పరీక్షల్లో భాగంగా వైద్యాధికారి శ్రావ్య వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వారి వెంట హెల్త్ అసిస్టెంట్ నగేశ్, సూపర్‌వైజర్ తులసీరాం, సంపత్‌కుమారి, ఏఎన్ఎం సుజాత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం ఎందుకు చేపట్టలేదు?

బేల: మండలంలోని ఉపశ్‌నాలలో ఆదివాసీలకు పది ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి, నిర్మాణ పనులు ఎందుకు చేయలేదని బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్ ప్రశ్నించారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. నిరుపేదలకు ఇళ్ల నిర్మాణంపై బీఆర్ఎస్ యూత్ నాయకుడు తాక్రే మంగేష్ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం అమలు కాలేదన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి తాక్రే సందీప్, రామెల్లి మోరేశ్వర్, సలాం దేవ్‌రావు, కొడే ప్రదీప్, దోటే అనిల్, గావుండే మనోజ్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ఆదిలాబాద్: నూతన పెన్షన్ విధానాన్ని తొలగించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం నిరసన తెలిపారు. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఒక్క రోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. నూతన పెన్షన్ విధానం వలన తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

అక్షింతలతో శోభాయాత్ర

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని అనుకుంట కాలనీ నుంచి బంగారుగూడ వరకు బుధవారం అయోధ్య శ్రీరామ జన్మభూమి అక్షింతల శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. భక్తిగీతాల నడుమ అనుకుంట శ్రీమార్కండేయ స్వామి దేవాలయం నుంచి బంగారిగూడ శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయం వరకు శోభాయాత్ర చేపట్టారు. అనంతరం బంగారుగూడలో ఇంటింటికీ అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. కౌన్సిలర్ శ్రీనివాస్, పోతుగంటి సురేశ్, శ్రీను, సంతోష్ సుభాష్, నరేశ్, గణపతి, మంచాల మల్లయ్య, కృష్ణ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొరకడం ఈజీ

- సీఈఐఆర్ పోర్టల్‌తో సత్ఫలితాలు
- పోయినా సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగిస్తున్న పోలీసులు



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఆదిలాబాద్ రూరల్ సీఐ, ఎస్సై (ఫైల్)

- ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన షేక్ ఫారుక్ అహ్మద్ అనే వ్యక్తి గత మూడు నెలల కిందట ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సెల్ ఫోన్ పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయడంతో మహారాష్ట్రకు చెందిన వ్యక్తి ఫోన్ వినియోగిస్తున్నట్లు తెలిసింది. వెంటనే ఆయన వద్ద నుంచి రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని మహాత్మా గాంధీ చౌక్‌కు చెందిన బండారి సుమిత్ కుమార్ అనే వ్యక్తి గత రెండు నెలల కిందట ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ని రాంపూర్ సమీపంలో రూ. 22 వేల విలువ చేసే తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆ ఫోన్ ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన వ్యక్తి వాడుతున్నాడు. వెంటనే ఆయన వద్ద నుంచి రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. ఇవే కేవలం రెండు ఉదాహరణాలు మాత్రమే. ఇప్పటి వరకు ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 15 నుంచి 20 మందికి పోయిన సెల్‌ఫోన్లను తిరిగి అప్పగించారు.

ఆదిలాబాద్‌రూరల్: ప్రస్తుత స్మార్ట్ యుగంలో ప్రతిది సెల్‌ఫోన్‌పై ఆధారపడావాల్సి వస్తోంది. మొబైల్ లేకపోతే కొందరికైతే నిమిషం కూడా గడవని పరిస్థితి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. ప్రతిరోజు గంటల తరబడి మాటలు, సామాజిక మధ్యమాల్లో ఆటవిడుపు, డిజిటల్ లావాదేవీలు, వ్యాపారాలు, ఉద్యోగులకు, ప్రతిఒక్కరికీ కనీస అవసరంగా మారింది. ఫోన్ ఎక్కడో పోగొట్టుకుంటే, దొంగతనానికి గురైతే అందులో ఉన్న ఫొటోలు, వ్యక్తిగత సమాచారం ఉంటుంది. ఆ సమయంలో ఎంతో ఆందోళనకు గురవుతారు. ప్రస్తుతం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించడం సులువైంది. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా తిరిగి సొంతం చేసుకునే అవకాశం ఉంది. గతంలో సెల్‌ఫోన్ పోయిందంటే దొరకడం కష్టమనే భావనే ఉండేది. పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం అంతంత మాత్రంగానే ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సెల్‌ఫోన్‌కు సంబంధించిన వివరాలు అన్ని అందుబాటులో ఉంటే కొన్ని గంటల్లోపే దొరుకుతోంది.

ఐఎంఈఐ ఆధారంగా గుర్తింపు..

పోయినా ఫోన్‌ను గుర్తించాలంటే అందులో ఐఎంఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) కీలకమైనది. ఫోన్‌ను కనుగోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతోంది. ముందుగా వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. పోయిన సెల్‌ఫోన్ బ్లాక్ చేసేందుకు రిక్వెస్ట్ వస్తుంది. దాన్ని ఎంచుకున్నాక ఫోన్ మోడల్, కంపెనీ, ఐఎంఈఐ నంబర్, బిల్లు నమోదు వివరాలు నమోదు చేయాలి.

పోగొట్టుకున్న ప్రాంతం నమోదు..

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను కనుక్కోవాలంటే ఎక్కడ పోయిందో ఆ ప్రాంతం వివరాలను ఫిర్యాదులో నమోదు చేయాలి. బాధితుడి పేరు, చిరునామా, గుర్తింపు పత్రం, ఓటీపీ కోసం ఫోన్ నంబర్‌ను పొందుపర్చాలి. ఈ ప్రక్రియ పూర్తి కాగానే ఐడీ నంబర్ వస్తోంది. దీని ద్వారా ఫోన్ వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఆయా వివరాలు పోర్టల్‌లో నమోదు చేసినంతరం పోగొట్టుకున్న సెల్ ఫోన్ పని చేయకుండా బ్లాక్ చేస్తారు. ఆ ఫోన్ ఎవరు వినియోగిస్తున్నారో గుర్తించేందుకు నిఘా పెడుతారు. సెయిర్ పోర్టల్‌లో సమాచారం తెలుసుకుంటారు. అనంతరం బాధితులను పిలిపించి అందజేస్తారు. అనంతరం ఐడీ నంబర్ ద్వారా అన్‌బ్లాక్ చేసుకొని వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

దరఖాస్తు చేసుకోవాలి



సెల్ ఫోన్‌లను జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఎవరైనా వారి సెల్‌ఫోన్ దొంగతనానికి గురైనా, పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీని ద్వారా ఎదుటి వ్యక్తి ఫోన్ వినియోగించిన్నట్లైతే వెంటనే ఆచూకీ తెలుసుకోవడానికి అస్కారం ఉంటుంది. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ముజాహిద్, ఎస్సై, ఆదిలాబాద్ రూరల్

మండలాన్ని అభివృద్ధి చేస్తా

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



మట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి: భీంపూర్ మండలాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. బుధవారం భీంపూర్ మండల కేంద్రంలో నూతనంగా రూ.31 లక్షలతో నిర్మించిన విద్యా వనరుల కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన భీంపూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం కృషి చేస్తానన్నారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు సైతం ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, ఈఈ అశోక్, డీఈ శంకర్, సర్పంచ్ లింబాజీ, ఎంపీపీ సంతోష్, ఎంఈవో శ్రీకాంత్, సెక్టోరియల్ అధికారి నారాయణ, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సమగ్ర శిక్షా ఉద్యోగులు

భీంపూర్ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను సమగ్ర శిక్షా ఉద్యోగులు కలిశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల వేతనాలు, క్రమబద్ధీకరణ చేయాలన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల అదికార ప్రతినిధి రవీందర్, ఉద్యోగులు శ్రీకాంత్, రాకేశ్, ప్రభావతి, పార్థసారథి, సంజీవ్ పాల్గొన్నారు.

విద్యార్థులతో భోజనం చేసిన ఎమ్మెల్యే

తాంసి: బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భీంపూర్ మండలంలో పర్యటనలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పాఠశాల హెచ్ఎం శిల్ప, ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

బజార్‌హత్నూర్: బోథ్ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని గులాబ్‌తండా గ్రామంలో రూ.20 లక్షల ఐటీడీఏ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. రూ. కోటి నిధులతో ఏసాపూర్ గ్రామానికి నిర్మించనున్న బీటీ రోడ్డుకు భూమిపూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు మల్లేపూల నర్సయ్య, తాటిపెల్లి రాజు, ఎంపీడీవో రాథోడ్ రాధ, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, సర్పంచులు విద్యాసాగరా, చంద్రకళ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



విద్యావనరుల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బోథ్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద గల సెయింట్ థామస్ పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడ పోటీలను ప్రారంభించారు. క్రీడలతో విద్యార్థుల్లో మానసికోల్లాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ సురేందర్, మల్లేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నాయకుల చేరిక



మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

జైనథ్: జైనథ్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ సర్పంచ్‌లు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం నిర్మల్‌కు వచ్చిన మంత్రి సీతక్క సమక్షంలో జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో, ఖాప్రి సర్పంచ్ ఎల్టి రమీలా వెంకట్ రెడ్డి, సాంగ్వి సర్పంచ్ విఠల్ రెడ్డి, కామాయి సర్పంచ్ వైద్య ఉమేష్, రాంపూర్ సర్పంచ్ అల్లం లింగన్న, బీఆర్ఎస్ నాయకులు పెందూర్ మోహన్, పెందూర్ తానాజీ, జంగిలి సురేష్, గిజ్జ నర్సింగ్, సిడాం దత్తు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మంత్రి సీతక్క కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మంత్రి సీతక్కను కలిసిన నాయకులు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను బేల మండల మాజీ జెడ్పీటీసీ రాందాస్ నక్లే, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డిలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు పేదలకు అందేలా చూడాలని నాయకులు సూచించారు. అలాగే జిల్లా రాజకీయాలపై చర్చించారు.

సన్మానం

బోథ్: సొనాల గ్రామానికి చెందిన భగత్ రాములు కూతురు భగత్ దీపిక కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో పూలే వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ గాజుల పోతన్న ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన నాలుగో తరగతి విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు రడాపు మధుసూదన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు శ్రీధర్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ సాయినగర్, హరిజనవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం పుస్తకాలు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో మా సం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనిల్ కుమార్, పట్నాపూర్ సర్పంచ్ సుగుణ, న్యాయవాది పంద్రం శంకర్, రఘు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కల బెడద



ఇచ్చోడ మండల కేంద్రంలో రోజురోజుకూ కుక్కల బెడద తీవ్రమవుతోంది. పలు కాలనీలో కుక్కలు గుంపుగుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో గుంపుగుంపులుగా సంచారిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చిన్న పిల్లలపై దాడి చేసే ప్రమాదం ఉన్నందున కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. – ఇచ్చోడ

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: ఎస్టీయూటీఎస్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను బుధవారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు పలు సమస్యలను పీవో దృష్టికి తీసుకువెళ్లారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ అశోక్‌కుమార్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దిలేశ్ చౌహాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీతల్ చౌహాన్, రవికుమార్, ఆత్మారాం, మల్లేశ్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన కొలాం ఆశ్రమ పాఠశాలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బుధవారం సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చలి తీవ్రత అధికంగా ఉండే ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థులు కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. గిరిజన విద్యార్థులకు ఆయా విద్యా సంవత్సరంలో ఇవ్వావాల్సిన దుస్తువులు, దుప్పట్లు, ఇతర వస్తువులు సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క స్పందించి విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలోని ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై వేరే శాఖలకు పంపించడం ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి



మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

కైలాస్‌నగర్: ఏ ఎన్నికలు వచ్చిన కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో మాట్లాడారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పలువురు బీఆర్ఎస్ సర్పంచులు, ఎంపీటీసీలు, ఐటీడీఏ డైరెక్టర్లు మంత్రి సీతక్క ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేరనున్నట్లుగా తెలిపారు. సమావేశంలో కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. నిర్మల్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా నుంచి బయలుదేరిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఐటీడీఏ డైరెక్టర్లు పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్ పూర్తి చేయాలి



నినాదాలు చేస్తున్న సభ్యులు

గుడిహత్నూర్: ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్ పనులను పూర్తి చేయాలని ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ కన్వీనర్ కాసవేని నారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్ లేని కారణంగా జిల్లా వెనుకబాటు గురవుతోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో 3336 కిమీ. రైల్వే లైన్ ఉంటే ఆదిలాబాద్‌కు మాత్రం కేవలం 50 కిమీకు మహారాష్ట్రకు అనుసంధానించారన్నారు. హైదరాబాద్‌కు రాకపోకలు సాగించాలంటే కేవలం 300కిమీ ప్రయాణానికి 12 గంటల పాటు ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఆదిలాబాద్ సమగ్రాభివృద్ధి జరగాలంటే ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ ఏర్పాటు చేసి హైస్పీడ్ రైలును నడపాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌కు రావాల్సిన నవోదయ విద్యాలయం వెంటనే కేటాయించాలన్నారు. బాజీరావ్ బాబా మరాఠీ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ, సైనిక్ స్కూల్ కేటాయించాలన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సెంట్రల్ గార్డెన్‌లో మేధావులతో చర్చావేదిక ఏర్పాటు చేయనున్నట్లు విద్యావేత్తలు, మేధావులు, వ్యాపారులు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట కోకన్వీనర్ నిమ్మల నారాయణ, నరేందర్, సుంక రమేశ్, కల్లెపల్లి శ్రీను, జాన్ పాల్గొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

బోథ్: సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని బోథ్ తాలూకా గోర్‌సేన నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. సెలవు దినంగా ప్రకటించకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాదవ్ శశికుమార్, చౌహాన్ అర్జున్, రాథోడ్ దేవిదాస్, జాదవ్ రవి, రాథోడ్ రాజేందర్‌లు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఫిబ్రవరి 15న సేవాలాల్ మహరాజ్ జయంతి రోజున సెలవు దినంగా ప్రకటించాలని బోథ్ తాలూకా గోర్ సేనా సభ్యులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఒకవేళ సెలవు దినంగా ప్రకటించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు, ముట్టడి కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోర్ సేన సభ్యులు పాల్గొన్నారు.

‘అంగన్‌వాడీలపై నిర్బంధాన్ని ఆపాలి’

ఎదులాపురం: అంగన్‌వాడీలపై ఏపీ ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. బుధవారం జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. అంగన్‌వాడీలతో చర్చలు జరిపి సమ్మె విరమించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, పార్వతి, సుభద్ర, గంగమ్మ, రేణుక, కౌసల్య, పార్వతి, కల్యాణి, ప్రేమల, శ్యామల, రత్న పాల్గొన్నారు.

దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

తాంసి: ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని భీంపూర్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం డిప్యూటీ తహసీల్దార్ హరిదాస్‌తో కలిసి మండల కేంద్రంలో చేపడుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. తప్పులు లేకుండా వేగంగా దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంతో నంబర్ సైతం వేయాలని సూచించారు. ప్రతి దరఖాస్తుదారుడి వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని ఆదేశించారు. వారి వెంట ఆర్ఐ అశోక్, ప్రేంకుమార్, తదితరులు ఉన్నారు.

ఇచ్చోడ: ప్రజాపాలన గ్రామసభల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే పనిలో ఆధికారులు నిమాగ్నమయ్యారు. తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో రాంప్రసాద్‌ల ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి విరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మండలంలో 13 వేలపైగా దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. బుధవారం నాటికి 7 వేలకు పైగా దరఖాస్తులు ఆన్‌లైన్ పూర్తయినట్లు పేర్కొన్నారు.